క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ మంచిర్యాల అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను సభ్యులు సోమవారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో పాటు ప్రతీ ఒక్కరి దాహార్తిని తీర్చేందుకు స్థానిక భక్తుల సహకారంతో చల్లని మినరల్ నీటిని చలివేంద్రంలో ఏర్పాట్లు చేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలరావు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, సభ్యులు సిరిపురం రాజేశం, నగునూరి శ్రీనివాస్, ఎల్క సంతోశ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కాముడి దహనం



దహనం చేస్తున్న యువకులు

బెల్లంపల్లి: కాముడి దహనం కార్యక్రమాన్ని బెల్లంపల్లిలో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగాయి. అంతకుముందు వారం రోజుల పాటు ఇంటింటా తిరుగుతూ చిన్నారులు జాజిరి ఆట ఆడారు. కర్రలను లయబద్ధంగా ఆడిస్తూ జాజిరి పాటలు పాడి వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఆఖరి రోజు ఆనందోత్సహాలతో తనివితీరా ఆడి పాడి అర్ధరాత్రి దాటాక బస్తీల్లో, బస్తీ శివారు ప్రాంతాల్లో కాముడి దహనాన్ని నిర్వహించారు.

షెడ్లు నిర్మించినా.. నిరుపయోగమే!



సేకరించిన చెత్తను ఆరుబయట కాల్చేస్తూ..

దండేపల్లి: గ్రామాల్లోని చెత్తను పడేసేందుకు గత ప్రభుత్వం గ్రామగ్రామానా సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. కానీ చాలా చోట్ల అవి నిరుపయోగంగా, మందు బాబులకు అడ్డాగా మాత్రమే ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరుబయట ఖాళీ ప్రదేశాల్లో వేసి తగులబెడుతున్నారు. దండేపల్లి మండలం గూడెంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డులో చెత్త వేయడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్లతో తీసుకొచ్చి ఖాళీ ప్రదేశంలో వేసి కాల్చివేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగానే ఉండిపోతున్నాయి.



నిరుపయోగంగా గూడెం సెగ్రిగేషన్ షెడ్డు

హోలీ..రంగోళి

భీమారం: రంగులు నింపుతున్న చిన్నారులు



ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో హోలీ వేడుకలను జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



గుడిపేటలో వేడుకల్లో చిన్నారుల సందడి





నస్పూర్‌లో...



బెల్లంపల్లి బజారు ఏరియాలో...

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా రంగుల వేడుకలు చూడ ముచ్చటగా సాగాయి. ఆకాశంలో హరివిల్లు విరిసినట్లు తీరొక్క రంగులతో హోలీ పండుగను ప్రజలు సోమవారం కనుల పండువగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా, ఆడమగ తారతమ్య బేధం లేకుండా ఒకరి ముఖానికి ఒకరు రంగుపూసి వేడుకలో మునిగితేలారు. చిన్నారులు గల్లీల్లో, యువకులు రోడ్లపై తిరుగుతూ పోటాపోటీగా రంగులు చల్లుకున్నారు. పొద్దు పొడుపుతో ప్రారంభమైన రంగులద్దే కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. డీజేలు, డ్రమ్స్, డప్పు చప్పుళ్ల మధ్య డ్యాన్స్‌లు చేశారు. ఇంటింటా పాటలు పాడుతూ హోలీ వేడుకలను ఎంజాయ్ చేశారు. వ్యాపార, వాణిజ్య వర్గాలు, కార్మిక కుటుంబాలు సంబురాల్లో పాల్గొన్నాయి. బెల్లంపల్లిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ మోటారు సైకిల్‌పై పుర వీధుల్లో తిరుగుతూ హోలీ వేడుకల్లో సంబురంగా పాల్గొన్నారు. గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో సిబ్బంది వేడుకల్లో మునిగితేలారు. జన్నారంలో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు సంబురాలు చేసుకున్నారు. చెన్నూర్‌లో పోలీసుస్టేషన్ సీఐ రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా దంపతులు హోలీ వేడకల్లో పాల్గొన్నారు. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు ఆయన నివాసంలో బీఆర్ఎస్ నాయకులు రంగులు పూసి వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు హోలీ వేడుకలను జరుపుకున్నారు. మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో ఏరియా జీఎం మనోహర్‌తో పాటు అధికారులు రంగులు చల్లుకుని సంతోషంగా గడిపారు.



జిల్లా కేంద్రంలో మహిళలు, చిన్నారులు



మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుకు రంగు పూస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గుడిపేటలో కేరింతలు కొడుతున్న చిన్నారులు



జన్నారం: సంబురాల్లో వర్తక సంఘం నాయకులు



తాండూర్: చిన్నారులతో హోలీ సంబురాల్లో ఎంపీటీసీ



వేమనపల్లిలో రంగులు చల్లుకుంటున్న యువకులు



చెన్నూర్: హోలీ సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు



జైపూర్‌లో...



పిన్నారంలో హోలీ సంబురాలు



మందమర్రిరూరల్: వేడుకల్లో ఏరియా జీఎం, అధికారులు



మంచిర్యాలటౌన్: వేడుకల్లో టీఎన్జీవోస్ నాయకులు



సోమగూడంలో పాల్గొన్న కేకే-5 మేనేజర్ అల్లావుద్దీన్, కార్మికులు



లక్సెట్టిపేట: హోలీ సంబురాల్లో యువకులు



నెన్నెలలో కేరింతలు కొడుతున్న యువకులు



దండేపల్లిలో రంగులు చల్లుకుంటున్న యువకులు, ఉద్యోగులు



సంబురాల్లో లైన్‌గడ్డ కాలనీవాసులు



బెల్లంపల్లిరూరల్: వేడుకల్లో యువకులు

పొలంగట్లపై బీరసాగు



కిష్టంపేటలో పొలంగట్లపై సాగు చేసిన బీర

మండలంలోని కత్తెరసాల, అక్కెపల్లి, శివలింగాపూర్, సుందరసాల, వెంకంపేట, మందపురం, సుబ్బరాంపల్లి, కిష్టంపేట, సుద్దాల, అంగ్రాజ్‌పల్లి, దుగ్నెపల్లి, చింతలపల్లి, అక్కెపల్లి, ఆస్నాద, తదితర గ్రామాల్లో రైతులు తక్కువ ఖర్చుతో కూరగాయలు సాగు చేస్తున్నారు. పొలంగట్లపై బీర, అలసంద సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.

- చెన్నూర్‌రూరల్



లింగంపల్లి సమీపంలో పొలం గట్లపై బీర, అలసంద

తుది దశలో సెంట్రల్ లైటింగ్ పనులు



ఆసుపత్రి ఎదుట ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం

బెల్లంపల్లి: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రస్తుతం విద్యుద్దీకరణ పనులు కొనసాగుతుండగా మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టంను వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెల్లంపల్లి గంగారాంనగర్ ప్రాంతంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఉంది. కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనం రెండేళ్ల క్రితం ప్రారంభించగా సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులకు బ్రేకులు పడ్డాయి. రూ.180కోట్ల అంచనాతో సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను ప్రతిపాదించగా, రూ.1.17కోట్లతో ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. అయితే కొన్నికారణాలతో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఆలస్యంగానైన పనులు ప్రారంభమై ప్రస్తుతం చివరిదశకు రావడంతో ఏరియా ఆసుపత్రి వర్గాలు, రోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

జాతీయ రహదారి వద్ద నుంచి ....

రాష్ట్ర వైద్య విధానపరిషత్ ఆధ్వర్యంలో 30పడకల సామర్థ్యం ఉన్న కమ్యూనిటీ హెల్త్‌సెంటర్(సీహెచ్‌సీ)ను 100పడకలకు అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అందుకు తగినట్లుగా ఆసుపత్రి ఆవరణలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు ఏరియా ఆసుపత్రి ఎదుట నుంచి వెళ్తున్న జాతీయ రహదారి వద్ద నుంచి ఆసుపత్రి ముఖ ద్వారం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. దాదాపు ఏడాది కాలం నుంచి సెంట్రల్ లైటింగ్ పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్డును నిర్మించి, విద్యుత్ స్థంభాలను ప్రతిష్ఠించారు. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ సిస్టం అందుబాటులోకి రానుండటంతో ఏరియా ఆసుపత్రి పరిసరాలు మసక చీకటి నుంచి బయట పడనున్నాయి.

బస్సు సౌకర్యం మూణ్నాళ్ల ముచ్చటే

చెన్నూర్‌రూరల్: ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించిందనుకున్నారు. బస్సు నడపడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కానీ చివరకు 15రోజులు మాత్రమే బస్సు నడిపించారు. ఆ తరువాత బస్సు బంద్ అయ్యింది. దీంతో ప్రజలు మళ్లీ ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది మండలంలోని కాచన్‌పల్లి, గంగారం, కమ్మరిపల్లి, సుద్దాల గ్రామాల పరిస్థితి.

రోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేదు...

మండలంలోని ఒత్కులపల్లి, చాకెపల్లి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో మూడు కి.మీ నడుచుకుంటూ



బస్‌స్టాప్‌ల వద్దకు వచ్చి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు పట్టించుకొని మా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బస్సు బందయ్యింది.



కాచన్‌పల్లి మీదుగా బస్సు 15రోజులు నడిపించారు. ఆ తరువాత బస్సు బందయ్యింది. బస్సు బందయ్యి రెండేళ్లు గడుస్తుంది. మళ్లీ ఎవరూ పట్టించుకోలేదు. మాకు బస్సు సౌకర్యం కల్పించాలి.

- మల్లేశ్, సుద్దాల

దుమ్ము లేస్తోంది..!



దండేపల్లి: పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా.. పనులు మాత్రం పూర్తి కావడం లేదు. దండేపల్లి మండలం గూడెం-మేదరిపేట రింగ్ రోడ్డు బీటీ పనులు వెల్గనూర్ సమీపంలో ఇంకా అసంపూర్తిగానే మిగిలాయి. బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పోసి పనులు అంతటితోనే నిలిపివేశారు. కంకర రోలింగ్ చేయకపోవడంతో వాహనాలు వెళ్లినప్పుడల్లా దుమ్ములేస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికా రులు స్పందించి వెల్గనూర్ సమీపంలో నిలిచిన బీటీ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.